## క్లుప్తంగా

### ముస్లింలకు ఇఫ్తార్ విందు



దాచేపల్లి : స్థానిక మర్కస్ మసీద్‌లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత కొత్వాల్ సైదా ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. తొలుత మసీద్‌లో వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, నాయకులు సయ్యద్ మౌలాలీ, షేక్ జానీభాషా, సైదా, కొప్పుల రామకృష్ణ, అన్నం రాము తదితరులు ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఆపదలో ఉన్నవారికి చేయూత అందించాలని చైర్మన్ సాంబయ్య చెప్పారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన సూరే అన్నపూర్ణ

పిడుగురాళ్ల: ఆర్టీసీ బస్సు బైకును ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన పట్టణంలోని జానపాడు రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దుర్గి నుంచి పిడుగురాళ్లకి వస్తున్న సమయంలో సూరే అన్నపూర్ణ, భర్తతో పాటు ద్విచక్ర వాహనంపై వస్తుండగా జానపాడు గ్రామంలోని రైస్ మిల్లుల వద్దకు రాగానే ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్య సూరే అన్నపూర్ణ(28) మృతి చెందగా, భర్తకు గాయాలు అయ్యాయి. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఘనంగా నవమి ఉత్సవ వేడుకలు



మాచర్ల: మాచర్ల పట్టణంలో శ్రీశైలం రోడ్డులో వేంచేసియున్న కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సోమవారం నాల్గవ రోజు శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పీటల మీద కూర్చొని పూజా కార్యక్రమాలు జరిపారు. ఉదయం 10గం''లకు దేవాలయ ప్రాంగణంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు విడేల సుందరరావు, కార్యదర్శి చిల్లంచర్ల సత్యనారాయణ, విడేల కృష్ణ, పోలిశెట్టి పిచ్చయ్య, శ్రీనివాసరావు, కొత్తమాసు బ్రహ్మారావు, మల్లికార్జునరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

వైద్యులు కేవీ ప్రవీణ్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కేవీ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కేవీ ప్రవీణ్‌రెడ్డి సందర్శించారు. దీనిలో భాగంగా రోగులను పరిశీలించి, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. బీపీ, షుగర్, ఉబ్బసం, ఆయాసం వంటి వ్యాధులకు మందులను అందజేశారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్యం గురించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏడుకొండలు, సురేష్, ఏఎన్‌ఎం కృష్ణకుమారి, సాయి, సాగర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### భగవద్గీతపై ప్రచారం




ఈపూరు: మండలంలోని వనికుంట, పెద్దకొండాయపాలెం, చిన్నకొండాయపాలెం గ్రామాల్లో త్రైతసిద్ధాంతం- ప్రబోధసేవాసమితి హిందూ జ్ఞానవేదికకి చెందిన చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రాసిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, రామాంజనేయులు, వై.చిలకమ్మ, వై. విజయలక్ష్మి, కోటేశ్వరమ్మ, గంగయ్య, వెంకటేశ్వరనాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి
- కౌన్సిల్ సమావేశంలో 24 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం




సమావేశంలో పాల్గొన్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి

మాచర్ల: పురపాలక సంఘంలోని ప్రతి వార్డులో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుని ప్రతి వార్డులో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా వివిధ పథకాలను చేపట్టేందుకు గ్రాంటుల ద్వారా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో సాధారణ సమావేశం చైర్మన్ బోయ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రతి వార్డు అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కౌన్సిల్ పరిధిలోని ప్రతి కౌన్సిలర్ తెలిపిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 24 అంశాలకు సంబంధించి సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. 16వ వార్డు నుంచి 31వ వార్డు వరకు మంచినీటి సరఫరాకు ట్యాంకర్లను అద్దెకు తీసుకోవడం. 8,26,14,1వ వార్డులో మంచినీటి సరఫరాకు బోర్లు ఏర్పాటు చేసి అంతర్గత కనెక్షన్‌లు ఇచ్చేందుకు టెండర్లు ఆమోదించారు. మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, లైట్లు ఏర్పాటు, 25వ వార్డులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ రథానికి ప్లాట్‌ఫాం, సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ. 4.50 లక్షలు ఖర్చు పెట్టేలా నిర్ణయం తీసుకున్నారు. ఆయా వార్డుల్లో వివిధ పనులకు సంబంధించి, 15వ ఆర్థిక సంఘం తరఫున వివిధ పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షణకు సంబంధించి సర్వేకు సిబ్బందిని నియమించి రీ సర్వే చేసి డ్రోన్ ఉపయోగించేందుకు భూ హక్కు పత్రం ఇచ్చేందుకు తీర్మానం చేశారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి తమ వార్డుల్లో చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు మదార్‌సాహెబ్, షేక్ సుభానిలు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ బోయ రఘురామిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు గట్లా అరుణాదేవి, చవ్వా అనిత, రామాంజనేయరెడ్డి, జగన్‌మోహన్‌రావు, కలివెల జ్యోతి, మందా సంతోష్, మాచర్ల చిన ఏసోబు, పోలా శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, కామనబోయిన మురళి తదితరులున్నారు.

# వైభవంగా కాళికాంభకు మహా కుంభాభిషేకం



ప్రత్యేక అలంకారంలో కాళికామాత



మహా కుంభాభిషేక ప్రాముఖ్యతను వివరిస్తున్న శ్రీగమ్భీరానంద భారతీ స్వామి

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీకాళికా మాతకు దేవస్థాన పుష్కర మహా కుంభాభిషేక మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులతో సుప్రభాతం, నిత్యనిధి, మహా నారాయణ హవనం, వనదుర్గా మహావిద్య హోమం చేపట్టి యతీశ్వరులచే మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం కళాన్యాసాది పునశ్చరణ, మహోధన కుంభ సమర్పణ, ధేను దర్శనం, విశేష బలి సమర్పణ, విశేష అర్చన, శ్రీచక్ర నవావరణార్చన, ఉత్సవాంగ హోమాలు, మహా పూర్ణాహుతి, మహదాశీర్వచనం, ఆచార్య సత్కారం జరిపించారు. వేలాది మంది గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పాడి, పంటలతో సుఖ సౌభాగ్యాలతో చల్లగా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన సుమారు 5వేల మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు యరవెద బ్రదర్స్ తెలిపారు. అనంతరం అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని మేళ తాళాలతో గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు.

#### దేవతారాధన మానవుని ధర్మం ...

అన్ని జన్మలకన్నా గొప్పదైన మానవ జన్మను ఇచ్చిన భగవంతుని పట్ల అందరూ కృతజ్ఞులై ఉండి, నిత్యం దైవా, దేవతారాధనలు చేయడం మానవుల విద్యుక్తధర్మని శృంగేరి విరూపాక్ష శ్రీపీఠాధిపతి శ్రీగమ్భీరానంద భారతీ స్వామి అన్నారు. కాళికామాత పుష్కర కుంభాభిషేక మమత్సోవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మంలోని ఆచారాలన్ని ఆరోగ్యదాయకమైనవని అందరూ సనాతన ధర్మాన్ని అనుచరించాలని, దేవాలయాలు, శక్తి పీఠాలను దర్శించకుని భగవంతుని కృపను పొందాలని తెలియజేశారు. మహా కుంభాభిషేక ప్రాముఖ్యతను వివరించారు. నిర్వాహకులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్‌హెచ్‌ఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం



హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ పూజలరామయ్య, పుష్పావతి, నిర్వాహకులు

రెంటచింతల: విద్యాభివృద్ధితో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారిని ఎస్‌హెచ్ ఆర్ ఫౌండేషన్ ప్రోత్సహిస్తూ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య అన్నారు. సోమవారం నారాయణపురం హనుమంతు జయంతి సందర్భంగా స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో సామాజిక, రాజకీయ, కళలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో ప్రతిభ కనపరిచిన 10 మందికి సర్పంచ్ మెమోంటోలు, అవార్డులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి నిర్దిష్టమైన లక్ష్యంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. మానసిక శాస్త్రవేత్త, డా.ఎంబి.చిన్నమ్మ మాట్లాడుతూ సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండి నైపుణ్యాతాభివృద్ధితో ప్రణాళికాబద్ధంగా లక్ష్యం చేరుకోవడానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఆర్ పౌండేషన్ చైర్మన్ నారాయనపురం శ్రీనివాసరావు, వైఎస్‌రావు సీపీ మండల అధ్యక్షుడు పూజల రామయ్య, విశ్రాంతి ఉపాధ్యాయులు బొడ్డుపల్ల ప్రశాంతరావు, రొక్కం సాల్మాన్‌రాజు, ఉపాధ్యాయురాలు పల్లెర్ల భారతి, కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, నాళం చిన్న బాబు, గిరిజన పాఠశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు, గాదె లూర్ధుమర్రెడ్డిలకు మెమోంటోలను, అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో నారాయనపురం పద్మావతి, పోకూరి కాశీపతి, చైర్మన్ డి.కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు సత్తాజ్‌బేగం ,భాగ్యమేరి తితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మాచర్ల: ఆర్టీసి సంస్థకు చెందిన ఏడాది కార్యకలాపాలు, ఆదాయం, ఖర్చులు పన్నుల నిర్వహణ తదితర అంశాల పై ఆర్టీసి రీజనల్ స్థాయి సోమవారం మాచర్ల ఆర్టీసి డిపో ను తనిఖీ చేశారు. డిఎం పిచ్చయ్య సమక్షంలో ముందుగా డిపోను సందర్శించి పనుల తీరు పై వివరాలు సేకరించి ఆ తరువాత బస్టాండ్ ప్రాంతంలో వివిధ వివరాలు సేకరించారు. నలుగురు విజిలెన్స్ సభ్యులు డిపోలో జరిగిన ప్రతి లావాదేవీలు పై వివరాలు సేకరించారు. అదే విధంగా బస్టాండ్ పరిధిలోని షాపులను పరిశీలన జరిపి అన్ని రికార్డులను పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు.

### ఏప్రిల్ 4 నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలనానికి ప్రత్యేక బస్సును ఏప్రిల్ 4 నుంచి ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్. ముక్తేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆర్టీసీ బస్సు పిడుగురాళ్ల నుంచి కానిపాకం, గోల్డెన్ టెంపుల్ అరుణాచలం వరకు వెళ్తుంది. 4వ తేదీ రాత్రి 10 గంటలకు పిడుగురాళ్ల డిపోన్ నుంచి బయలుదేరుతుంది. తిరిగి 7వ తేదీ ఉదయం 6 గంటలకు పిడుగురాళ్ల డిపోకు చేరుకుంటుందన్నారు. వెళ్లి వచ్చేందుకు రూ.2500లు టిక్కెట్ అవుతుందని డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు పేర్కొన్నారు.

### జవ్వాజికి నివాళి

కారెంపూడి: ఇటీవల స్వర్గస్తులైన మండల బీసీ విభాగం నాయకుడు జవ్వాజి వెంకటేశ్వర్లుకు వైఎస్సార్‌సీపీ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి నివాళులర్పించారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో సోమవారం జరిగిన వెంకటేశ్వర్లు సంస్మరణ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి పాల్గొని జవ్వాజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, ఉన్నం ఆదిశేషగిరిరావు. ఎంపీటీసీ గాడిపర్తి పూర్ణయ్య, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అవినీతికి కేరాఫ్ తెలుగుదేశం పార్టీ

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ, పాల్గొన్న పార్టీనేతలు

గురజాల : తెలుగుదేశం పార్టీ హయాంలోనే అవినీతి, అక్రమాలు జరిగాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), పట్టణ కన్వీనర్ కె అన్నారావులు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న జరిగిన టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీ నారాయణలు మాట్లాడిన మాటలు దయ్యాలు వేదాలు మాట్లాడినట్లు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో మరుగుదోడ్ల నిర్మాణం పేరుతో వేల కోట్లు అవినీతి జరిగిందని, పేకాట క్లబ్‌లు నిర్వహణ, అక్రమ మైనింగ్ పేరుతో అవకతవకలు చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.

2014–2019 మధ్య జరిగిన అభివృద్ధి ఎమిటో చెప్పాలని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవినీతి రహిత పాలన అందించాలనే లక్ష్యంతో పాలన అందిస్తున్నారన్నారు. అవినీతిలో పీజీలు చేసిన యరపతినేని, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇష్టం వచ్చినట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. టీడీపీ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ఇకనైనా మాటలు జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మాజీ ఎంపీపీ వీరం రెడ్డి అమరారెడ్డి, కనకం ఆదినారాయణ దత్తు, నగర పంచాయతీ విప్ కుక్కమూడి అనిల్‌కుమార్, గుంటూరు రైల్వే బోర్డు మెంటర్ కె రవిశంకర్, గోళ్ళ సైదయ్య తదితరులున్నారు.

# నూతన స్కూల్ భవననిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు

పిడుగురాళ్లరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కరాలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల తరగతి గదులకు భూమిపూజ మహోత్సవాన్ని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుందన్నారు. దీనిలో భాగంగానే నాడు– నేడు కింద రూ. 1.60 కోట్ల నిధులతో 6 తరగతి గదులు, కంపౌండ్ వాల్, బాయ్స్, గాల్స్ టాయిలెట్స్, కిచెన్ షెడ్‌ను నిర్మించినున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో 5 ఎకరాల భూమిని సేకరించామని, ఇక్కడ పాఠశాలను ఏర్పాటు చేయడం కోసం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. గ్రామ పిల్లలు ఎక్కడికో వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, నేడు గ్రామంలోనే జిల్లా పరిషత్ పాఠశాలను నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లాపిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు చల్లా శివారెడ్డి, గడ్డం వలి, విద్యా కమిటీ చైర్మన్ రాంబాబు నాయక్, ఎంపీటీసీ గురవారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నంబూరి పుల్లారెడ్డి,గ్రామ కన్వీనర్ అబ్దుల్లా, ఇల్లూరి వెంకటరామిరెడ్డి, దేవాలయ అధ్యక్షుడు మద్దసాని రమణారెడ్డి, ముదేల శ్రీనివాస్‌రెడ్డి, ముసలయ్య, మోతాదు పెద మాబు, నర్సిరెడ్డి, మాజీ డైరెక్టర్ మద్దసాని రమణారెడ్డి, సైదాబుడే, కళాయి ఇస్మాయిల్, ఖాశీం, గౌస్, రషీద్, మస్తాన్‌వలి, పుల్లారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారం సక్రమంగా అందించాలి

ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కారెంపూడి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఎవరైనా అందలేదని ఫిర్యాదు చేస్తే సంబంధిత అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని పై అధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పేటసన్నెగండ్ల అంగన్‌వాడీ సెక్టార్‌లో అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ చిన్నారులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించి వారిని ఆరోగ్యవంతమైన భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తోందని ఆ లక్ష్య సాధనకు అంగన్‌వాడీ టీచర్లు క్షేత్ర స్థాయిలో నిజాయితీగా పనిచేయాలని ఎంపీడీఓ హితవు పలికారు. ఆకు కూరలు, కూరగాయలు, చిరు ధాన్యాలలో ఉండే పోషక విలువలను వివరిస్తూ అంగన్‌వాడీ టీచర్లు వాటి ప్రదర్శన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేంద్రం అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# చింతపల్లిలో వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్, వైద్య సిబ్బంది సోమవారం గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలందించారు. 104 సంచార వైద్యశాల సిబ్బంది కూడా వైద్య సేవల్లో పాల్గొన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు డాక్టర్ ఆర్ ఆంజనేయులునాయక్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇంటింటికీ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్లకు డాక్టర్, వైద్య సిబ్బంది వెళ్లి వారికి మందులు తీసుకునే విధానం, ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు వారు వాడుతున్న మందులు పరిశీలించి తగిన సూచనలు చేశారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌ఓ లలిత, ఏఎన్‌ఎం రాణి, 104 వైద్య సిబ్బంది శివసుధాకరరెడ్డి, శ్రావణి, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది అవినాష్, శ్రీనివాసరావు, ఆశా వలంటీర్లు జయకుమారి, రమాదేవి, పరిశుద్ధం, జ్యోతి సేవలందించారు. మధ్యాహ్నం డాక్టర్, వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని తనిఖీ చేశారు.

### టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు

వైఎస్సార్ సీపీ కో ఆప్షన్ సభ్యుడు పీర్ అహ్మద్

గురజాల : ఆదివారం రాత్రి జరిగిన తెలుగుదేశం పార్టీ భారీ బహిరంగ సభలో గంగవరం గ్రామానికి చెందిన 200 మంది వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీలో చేరారని చెప్పడం అవాస్తవమని కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ అన్నారు. గంగవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక్కవై వైఎస్సార్ సీపీ నాయకుడు కూడా టీడీపీలో చేరలేదని చేరిన వారు కూడా గంగవరం గ్రామానికి చెందిన వారు కాదని వారంతా బయట వ్యక్తులు అన్నారు. బయట వ్యక్తులు తీసుకువచ్చి టీడీపీలో చేరారని చెప్పడం టీడీపీ వారికే చెల్లుబాటు అవుతుందన్నారు. పది చేరినా వంద మంది చేరినట్లు ప్రచారం చేసుకోవడం టీడీపీ వారికి అలవాటన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ జి చిన ఓబయ్య, గ్రామ సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు, పూజల చంటి, తదితరులున్నారు.

# వడియరాజుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: వడియరాజుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సమావేశమై వడియరాజుల సమస్యల గురించి మార్కెట్ యార్డు చైర్మన్ దృష్టికి తీసుకొని వచ్చారు. ఈసంద్బంగా చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వడియరాజులకు పెద్ద పీట వేశారన్నారు. తనకు మార్కెట్ యార్డు చైర్మన్ కట్టబెట్టి మనపై మరింత బాధ్యత పెంచారన్నారు. వడియరాజుల సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ముందు ఉంటుందని ఆయన తెలియజేశారు. ఏసమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకొని వస్తే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈసందర్భంగా వడియరాజు నాయకులు చైర్మన్ దృష్టికి కొన్ని సమస్యలను తెలియజేశారు. వీటిని పరిష్కరించేందుకు అడుగులు వేస్తానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, కౌన్సిలర్లు తురక ముక్కంటి, ఉప్పు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇర్ల గురుస్వామి తదితరులు ఉన్నారు.

# అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల సీడీపీఓ కార్యాలయం పరిధిలో 6 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు, నాలుగు అంగన్‌వాడీ ఆయాల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ శ్రీవల్లి సోమవారం తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలోని పిడుగురాళ్ల పట్టణంలోని జమున స్కూల్ ప్రాంతంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్సీ కేటగిరిలో ఒకటి, పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో జనరల్ కోటలో ఒకటి, మాచవరం మండలం కొత్తపాలెం గ్రామంలో బీసీ ప్రాంతంలో జనరల్ కేటగిరిలో ఒకటి, పిన్నెల్లి బీసీ కాలనీలో బీసీఏ 1, దాచేపల్లి మండలం మాదినపాడు గ్రామంలో ఎస్సీ కేటగిరిలో ఒకటి, అలాగే పెద్దగార్లపాడు గ్రామంలో జనరల్ కేటగిరిలో ఒకటి అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని అదేవిధంగా అంగన్‌వాడీ ఆయా పోస్టులు నాలుగు ఉన్నాయని, వాటికి పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు బీసీ మైనార్టీలు నివసించే ప్రాంతంలో ఎస్సీ కేటగిరి ఒకటి, కోనంకి గ్రామంలో జనరల్ కేటగిరిలో ఒకటి, దాచేపల్లి మండలంలోని ముత్యాలంపాడు జనరల్ కేటగిరిలో ఒకటి, దాచేపల్లి లోని బ్యాంక్ బజారులో జనరల్ కేటగిరిలో ఒకటి, మొత్తం నాలుగు అంగన్‌వాడీ ఆయాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 21 జులై 2023 నాటికి 21 సంవత్సరాలు పూర్తియి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండి 10 వ తరగతి ఉత్తీర్ణలై ఉండాలని, అలాగే అంగన్‌వాడీ ఆయాలను పోస్టులకు ఏడవ తరగతి ఉత్తీర్ణులై 21 జులై 2023 నాటికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు ఏప్రిల్ నాల్గొవ తేదీ లోపు పిడుగురాళ్ల పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని సీడీపీఓ శ్రీవల్లి పేర్కొన్నారు.

### పశువులకు వ్యాధి నివారణకు టీకాలు

ఈపూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈపూరు మండలంలోని అన్ని గ్రామాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, పందులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు జరుగుతుందని ఈపూరు పశువైద్యశాల ఏడీ డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది టీంలుగా ఏర్పడి గ్రామాల్లో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు పలు గ్రామాల్లో సుమారు 3 వేల పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు.

### రెండు ద్విచక్రవాహనాలు ఢీ

నాదెండ్ల: అప్పాపురం-లింగంగుంట్ల మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులకు గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. 108 సిబ్బంది ఈఎంటీ అఖిల్, పైలట్ శ్యామ్ తెలిపిన వివరాల మేరకు అప్పాపురం గ్రామానికి చెందిన షేక్ నాగూర్, పి అలి, షేక్ మస్తాన్‌వలి తమ ద్విచక్రవాహనంపై రాత్రి 9.30 గంటల సమయంలో అప్పాపురం వెళ్తున్నారు. అదే సమయంలో నాదెండ్ల గ్రామానికి చెందిన పవన్ తన ద్విచక్రవాహనంపై స్పిన్నింగ్ మిల్లు వద్దకు వచ్చేసరికి ఇరు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నలుగురూ గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారంతో చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# దాడికి పాల్పడిన నలుగురిపై కేసు

నాదెండ్ల: పాత కక్షల నేపధ్యంలో వ్యక్తిపై నలుగురు దాడి చేసిన సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన పూదోట పోలురాజు కుటుంబానికి సమీప బంధువులైన పూదోట రామారావు కుటుంబానికి పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదిన సాతులూరు గ్రామంలో జరిగిన తిరునాళ్ళలో ఘర్షణ పడ్డారు. 24న గ్రామంలో మరోసారి ఘర్షణకు దిగారు. పోలురాజుపై రామారావు, వెంకటస్వామి, గోపీ, వెంకయ్యలు దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేశారు.

### సమస్యలు పరిష్కరించాలని డీటీకి వినతి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఎం.డి.యూ వాహనదారులు

గురజాల : ఎం.డి.యు ఆపరేటర్స్ రేషన్ పంపిణీ దారుల సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎం.డి.యు ఆపరేటర్స్ నాయకుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్సూను ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందని బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది మాత్రం తమ వేతనాల్లో కట్ చేస్తున్నారని, ప్రమాద బీమా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే జీవోల ప్రకారం మండల స్థాయి అధికారులు నడుచుకునే విధంగా చూడాలని, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు.